క్లుప్తంగా

జీతాల కోసం గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన



సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

బాడంగి: మండలంలో కొద్ది నెలలుగా గ్రీన్ అంబాసిడర్లకు పంచాయతీలు జీతాలు చెల్లించడం లేదని, వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు సుమారు ఆరు నుంచి 15 నెలల వరకు జీతాల బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఎంపీడీఓ రామకృష్ణకు అందజేశారు.

విలేజ్ పార్కు నిర్మాణానికి స్థల పరిశీలన



జగన్నాథపురంలో విలేజ్ పార్కు కోసం స్థల పరిశీలన చేస్తున్న శంబంగి తదితరులు

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో విలేజ్ పార్కు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అధికారులతో కలసి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ బొద్దల పద్మ బుధవారం పరిశీలించారు. విలేజ్ పార్కు నిర్మాణానికి అనుకూలమైన ప్రదేశమని గ్రామంలో ఎవరికీ వ్యతిరేకత లేదని వెంటనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని తెలిపారు. పరిశీలనలో బొద్దల సత్యన్నారాయణ, ఎంపీటీసీ, ఏపీఓ, జేఈలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బొబ్బిలి రూరల్: మండంలోని అలజంగి గ్రామ సీతారామ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. మస్తర్లు, కూలీల సంఖ్యను లెక్క సరిచూసి రికార్డులను పరిశీలించారు. వేతన దారుల సంఖ్య పెంచాలని మూడు వందల రూపాయిల కూలీ గిట్టుబాటు అయ్యే పనులను గుర్తించి చేయించాలన్నారు. వేతనదారులకు తాగునీరు, నీడ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ లక్ష్మీపతిరాజు తదితరులు ఉన్నారు.


బొద్దూరులో రక్తదాన శిబిరం



సంతకవిటి: శిబిరంలో రక్తం దానం చేస్తున్న దాతలు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు ప్రారంభించారు. 12 మంది రక్తదానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వల్లూరు గణేష్, రెడ్‌క్రాస్ చైర్మన్ సాయి ప్రశాంత్, హెచ్ఎం మల్లేశ్వరరావు, పాఠశాల జూనియర్ రెడ్‌క్రాస్ ఉపాధ్యాయులు ఎ.దామోదరరావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి



ఎం.డోలపేటలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రేగిడి: సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీం అన్నారు. మండల పరిధి మీసాలడోలపేట గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా వలన జీవితాలు అగమ్యగోచరంగా మారుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు ఎం.మాన్యాలు, మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మూగబోయిన మగ్గం

- అటకెక్కిన నేతన్న నేస్తం
- ఆర్థిక సాయం అందక ఇతర కూలీ పనులకు నేతన్నలు
- కనిపించని ఉచిత విద్యుత్ పథకం
- పెట్టుబడి లేక మూలకు చేరుతున్న మగ్గాలు



కంచరాంలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

రాజాం: మరుగునపడ్డ చేనేతను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెలికితీసింది. వలసబాట పడుతున్న కార్మికులకు నేతన్న నేస్తం అందించి ఆదుకుంది. ప్రతీ ఏడాది తంచన్‌గా ప్రతీ మగ్గం ఉన్న లబ్ధిదారునికి ముడి సరుకులు, మగ్గాలు, ఇతర పరికరాలు కొనుగోలు నిమిత్తం రూ.24 వేలు అందించేది. ఈ డబ్బుతో కార్మికులు ముడి సరుకులు కొనుగోలు చేసి, నేత చేసి చీరలు, ధోతీలు వంటివి తమకు నచ్చిన సొసైటీలకు, ప్రైవేట్ వర్తకులకు విక్రయించేవారు. వచ్చిన ఆదాయంతో ఇంటిల్లపాది సుఖంగా, సొంత గ్రామాల్లో ఉంటూ జీవనం సాగించేవారు. గుంటూరు, హైదరాబాద్, చీరాల, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో వలసల్లో ఉండే చేనేత కార్మికులు సైతం తమ ఇళ్లకు వచ్చి మగ్గాలు పెట్టుకున్నారు. దీంతో గ్రామాల్లో చేనేత కార్మికుల ఇళ్లల్లో టిక్కుటిక్కుమని మగ్గం శబ్దం వినిపించేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నేతన్న నేస్తం అటకెక్కింది. ముడి సరుకులు కొనుగోలుకు మదుపులు లేవు. అప్పులు చేస్తే వడ్డీలు చెల్లించలేని పరిస్థితి ఉంది. సొసైటీలకు ఎన్నికలు జరగలేదు. ముడిసరుకులు పంపిణీ చేసే సహకార సంఘాలు వెనుకడుగు వేయడంతో పాటు సరుకును కూడా కొనుగోలు చేయడం మానేశాయి. ఇవే కాకుండా మూలిగిన నక్కపై తాటిపండు పడ్డట్టు నేతన్న నేస్తానికి ప్రభుత్వాలు విధించే జీఎస్టీ మరింత భారంగా మారింది.



బొద్దాంలో చేనేత సహకార సొసైటీ

ఉచిత విద్యుత్ లేనట్టేనా..

అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చింది. ఇంతవరకూ ఆ పథకం అమలు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 12 సహకార సంఘాల పరిధిలో 800 మంది చేనేత కార్మికులు సమోదై ఉన్నారు. వీరికి సాధారణ మగ్గాలు ఉంటే 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలు ఉంటే 700 యూనిట్లు ఉచిత విద్యుత్‌కు అవకాశం ఇస్తామని ప్రకటించారు. అయితే ఇంతవరకూ ఈ పథకం ఆనవాళ్లు కనిపించలేదు. అంతేకాకుండా 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు ఇచ్చే పింఛన్ ఇప్పుడు కొత్త లబ్ధిదారునికి ఒక్కరికి కూడా గత ఏడాది కాలంగా అందలేదు.

నియోజకవర్గంలో 210కి పైగా కుటుంబాలు

రాజాం నియోజకవర్గంలో 210కి పైగా చేనేత కుటుంబాలు ఉన్నాయి. గతంలో ఈ కుటుంబాలకు నేతన్న నేస్తం అందేది. రాజాంలో కంచరాం, పెనుబాక, బొద్దాం, మల్లికార్జున కాలనీ గ్రామాల్లోనూ, సంతకవిటి మండలంలోని మందరాడ, కాకరాపల్లి, పుల్లిట, మామిడిపల్లి, సురవరం, మండాకురిటి, బొద్దూరు గ్రామాల్లోనూ, రేగిడి మండలం లింగాలవలస గ్రామాల్లో ఎక్కువగా చేనేత కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి నేత పని మినహా మిగిలిన ఏ పనిరాని పరిస్థితి ఉంది. వీరి కుటుంబాల్లో చాలా మంది ఇప్పుడు వలసబాట పడుతున్నారు. వీరందరికీ గతంలో జగనన్న నేతన్న నేస్తం ఆదాయ వనరుగా ఉండేది. వీటికి తోడు చేయూత, ఆసరా వంటి పథకాలు, స్త్రీనిధి రుణాలు సకాలంలో ఆదుకునేవి. ఇప్పుడు ఈ ఆదాయ వనరులు పడిపోవడంతో పాటు ఉపాధి పనుల్లో న్యూ స్ట్రేటజీ పనులు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులు చేయలేక, నేత పనిలేక, నేసిన సరుకులు అమ్ముడుకాక అవస్థలు పడుతున్నారు. కొంతమంది చేనేత కార్మికులు రాజాం పట్టణంలో హోటళ్లు, టీ స్టాల్స్, బట్టల దుకాణాల్లో పని చేస్తుండగా, మరికొంతమంది హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. ఆయా కుటుంబాలకు చెందిన వృద్ధులు, చిన్నారులు ఇక్కడ బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తం మాకు ఆసరాగా ఉండేది. ముడిసరుకు కొనుగోలుకు బాగా ఉపయోగపడేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఉచిత విద్యుత్ అందడం లేదు. ఈ నేత పని గిట్టుబాటు లేక వేరే పనులకు వెళ్తున్నాం. ఉపాధి పనులు కూడా కష్టంగా ఉంది.

– వై.సూర్యారావు, చేనేత కార్మికుడు, రాజాం

మా గోడు ఎవరికీ పట్టడం లేదు..

నేతన్న గోడు ఎవరికీ పట్టడం లేదు. నేత దుస్తులు కొనుగోలు కూడా తగ్గిపోయింది. గత ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడమే కాకుండా, సొసైటీలకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పుడు ఆ ప్రాధాన్యత కూడా లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా కుటుంబాల్లోని చాలామంది ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. మేం ఇతర పనులు చేసుకుంటున్నాం.

– ముతికి గోవిందరావు, నేత కార్మికుడు, రాజాం

రాష్ట్రంలో అరాచక పాలన



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇంచార్జ్ తలే రాజేష్

రాజాం: కూటమి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, అరాచకం రాజ్యమేలుతోందని, సామాన్యులు జీవించలేని పరిస్థితులు నెలకొన్నాయని వైఎస్సార్ సీపీ రాజాం ఇంచార్జి డాక్టర్ తలే రాజేష్ ధ్వజమెత్తారు. మండలంలోని దోసరి గ్రామంలో గ్రామ దేవత అసిరితల్లి పండగ ఉత్సవాల్లో ఆయన బుధవారం పాల్గొన్నారు. గ్రామదేవతకు పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో జగనన్న పాలనలో డీబీటీ విధానం ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవని, ప్రస్తుతం ఆ పరిస్థితులు తారుమారయ్యాయన్నారు. కూటమి పాలకులు ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి, ప్రతిపక్ష పార్టీలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయింపు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, భూ కబ్జాల్లో మునిగిపోయారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్‌పీటీసీ బండి నర్సింహులు, దోసరి సర్పంచ్ తులసీ నాయుడు, ఎంపీటీసీ వండాన వాసు, కోనారి అప్పారావు, అజ్జాడ రమణ, కోండ్రు తిరుపతి, కిషోర్, విశ్వనాథం, భాను తదితరులు ఉన్నారు.

పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేయాలి



పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేయాలని గ్రామస్తులు ఇచ్చిన వినతిపత్రాన్ని చూస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే

తెర్లాం: మండలంలోని సుందరాడ గ్రామంలోని యూపీ స్కూల్‌లో ఉన్న 6 నుంచి 8 తరగతుల విద్యార్థులను నెమలాం హైస్కూల్‌లో విలీనం చేసే ప్రక్రియను నిలుపుదల చేయాలని ఆ గ్రామస్తులు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనను కోరారు. సుందరాడ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సుందరాడ నుంచి నెమలాం గ్రామానికి సుమారు 5కిలో మీటర్లపైనే దూరం ఉంటుందని, పాఠశాలలోని 6, 7, 8 తరగతులను నెమలాం హైస్కూల్‌లో విలీనం చేస్తే అక్కడి వెళ్లేందుకు ఎటువంటి రవాణా సౌకర్యం లేదని వారంతా ఎమ్మెల్యేకు తెలియజేశారు. అంతకుముందు తన సొంత నిధులతో పెరుమాళిలో ఏర్పాటు చేసిన మినీ మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పాలిథిన్ నిషేధానికి మేము సైతం



స్వచ్ఛంద సంస్థలు సమకూర్చిన గుడ్డసంచులు చూపుతున్న అధికారులు, సంస్థల ప్రతినిధులు

రాజాం సిటీ: పట్టణంలో పాలిథిన్ నిషేధానికి మేము సైతం అంటూ స్వచ్ఛంద సంస్థల సభ్యులు ముందుకు వచ్చారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పర్యావరణ పరిరక్షణ సమితి, రెడ్‌క్రాస్, మానవతా సంస్థ, వికాస తరంగిణి సభ్యులు కమిషనర్ జె.రామప్పలనాయుడును కలుసుకుని ప్రతిజ్ఞ చేశారు. రాజాంను పాలథిన్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడంలో తమ వంతు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా గుడ్డసంచులు పంపిణీ చేపడుతున్నామని కమిషనర్‌కు తెలిపారు. పాలథిన్ కవర్ల నిషేధంలో అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించనున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మానవతా సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, వికాస తరంగిణి అధ్యక్షుడు వి.పైడిరాజు, సీమకుర్తి ప్రసాద్, వంశీకృష్ణ, పి.సోమశేఖర్, గట్టి పాపారావు, లక్షున్నాయుడు, సింహాచలం, సురేష్, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చేపలకు డిమాండ్



రాజాం మార్కెట్‌లో చేపల విక్రయాలు

రాజాం: రాజాం మార్కెట్‌లో చేపలకు డిమాండ్ పెరిగింది. కొంతకాలంగా బ్రాయిలర్ చికెన్ తినడంలో ప్రజలు అనాసక్తి చూపుతున్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా ప్రజలు చికెన్‌తో పాటు గుడ్డుకు దూరంగా ఉంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మినహా మిగిలిన ప్రాంతాల్లో గుడ్డు వినియోగం తగ్గింది. ఇదే సమయంలో చేపలపై ప్రజలు ఆసక్తి పెరిగి, వినియోగం ఎక్కువైంది. దీంతో రాజాం పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో చేపలకు డిమాండ్ పెరిగి, కొత్తగా చేపల విక్రయాల షాపులు పెరుగుతున్నాయి. గతంలో కిలో చేపలు ధర రూ.120లు ఉండగా, ఇప్పుడు రూ.140లు నుంచి రూ.300లు వరకూ పెరిగింది. సముద్రం చేపలు, చెరువు చేపల ధర కిలో రూ.140లు ఉండగా. కొర్రమీను చేపల ధర కిలో రూ.300లు, చెరువు రొయ్యల ధర కిలో రూ.300లకు చేరింది. చెరువు చందం కిలో రూ.150లు పలుకుతోంది.

అంధకారంలో కింజంగి ఎస్సీ కాలనీ

వంగర: మండల పరిధి కింజంగి ఎస్సీ కాలనీ మంగళవారం రాత్రి అంధకారంలో ఉందని కాలనీవాసులు మండిపడ్డారు. కాలనీలో విద్యుత్ సమస్య నెలకొందని స్థానిక లైన్‌మేన్‌కు తెలియజేసినా పట్టించుకోలేదని వారంతా మండిపడ్డారు. ఏ సమస్య వచ్చినా సకాలంలో లైన్‌మేన్ స్పందించడం లేదని, తక్షణమే కాలనీకి విద్యుత్ పునరుద్ధరించి లైన్‌మేన్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రెవెన్యూ సిబ్బంది అక్రమాలతోనే ఆక్రమణలు

బొబ్బిలి: రామభద్రపురంలో ప్రభుత్వ స్థలాల కబ్జాలకు, ఆక్రమణలకు రెవెన్యూ సిబ్బంది అక్రమాలు, అవినీతే కారణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం అన్నారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రామభద్రపురంలో వివాదాస్పద స్థలం కోసం గొడవలు తీవ్ర స్థాయికి చేరడానికి కారణం ఇదేనన్నారు. ఈ మండలంలోని గొల్లల పేట, కొండకెంగువ,, రొంపిల్లి వలస, కొట్టక్కి తదితర గ్రామాల్లో ఆక్రమణలపై తాము నిరసనలు, ధర్నాలు చేశామన్నారు. ప్రభుత్వ, డి పట్టా భూములు పెత్తందార్ల చేతుల్లోకి వెళ్లడానికి అక్కడి రెవెన్యూ అధికారులు, సిబ్బంది పటిష్టంగా లేరన్నారు. రికార్డులు తారుమారు చేయడంలో అక్కడివారు దిట్టన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డుకు భూములిచ్చిన వారి పేరున కాకుండా అప్పటికప్పుడు రికార్డులు మార్చి లబ్ధి చేకూర్చారన్నారు. ప్రస్తుతం కోర్టులో ఉన్న ఆ స్థలాన్ని ప్రజావసరాల కోసం వినియోగించాలని వారు డిమాండ్ చేశారు. మొన్నటి దాడి వెనుక ఉన్న అసలైన వివాదాన్ని గుర్తించి లోతుగా దర్యాప్తు చేయాలని, లేకుంటే రామభద్రపురంలో మరింతగా శాంతిభద్రతలు క్షీణించే ప్రమాదముందని అధికార యంత్రాంగం గుర్తించాలన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మద్యం బాటిళ్లు ధ్వంసం చేయిస్తున్న ఏఈఎస్ దొర, ఎస్ఐ తదితరులు

రామభద్రపురం: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం దుకాణాలు నిర్వహించాలి తప్ప గ్రామాల్లో ఎవరైనా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని ఏఈఎస్ ఏఎస్ దొర హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గతంలో పట్టుబడిన మద్యంతో పాటు సారాను ఎస్ఐ వి.ప్రసాదరావుతో కలిసి బుధవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని ఈ ఏడాది మార్చి నెలలో అక్రమంగా తరలిస్తున్న 491 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని 177 మందిని అరెస్టు చేశామన్నారు. అలాగే 450 లీటర్ల సారా పట్టుకున్నామన్నారు. సంకల్పం, నవోదయం 2.0 కార్యక్రమాల్లో భాగంగా మద్యం, మత్తుపదార్థాలు తీసుకోవడడం వల్ల సంభవించే దుష్పరిణామాలపై యువతకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నేతలు

రాజాం సిటీ: మండల పరిధి సోపేరు గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు నీటి ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ సర్పంచ్ ములగ రాము, ఎంపీటీసీ పెరుమాళి చిన్నారావు తెలిపారు. ఇందులో భాగంగా రూ.25 లక్షలతో 60 కిలో లీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణం చేపట్టనున్నామని అన్నారు. కార్యదర్శి బి.రాము, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

బాడంగి: మండలంలోని ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్లాప్‌మిత్రల జీతాలు ఎక్కడా పెండింగ్ లేకుండా చెల్లించాలని సూచించారు. శతశాతం ఇంటి పన్నుల వసూలు చేపట్టాలన్నారు.

సంక్షిప్తంగా...

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

తెర్లాం: గ్రామాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని ఎంఈఓలు జె.త్రినాధరావు, ఆర్.పాపారావు కోరారు. మండలంలోని బుధవారం ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా తెర్లాం, కూనాయవలస, పెరుమాళి, చుక్కవలస, కాగాం గ్రామాల్లో పిల్లల ఇంటికి వెళ్లి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫాం పాండ్ల పరిశీలన

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం, గుళ్లపాడు, ఉంగరాడ తితర గ్రామాల్లో రైతులు, ఉపాధి వేతనదారులు నిర్మిస్తున్న ఫాం పాండ్లను ఏపీఓ ఎస్.హరనాధరావు బుధవారం పరిశీలించారు. వాటి నిర్మాణాలకు సంబంధించి కొలతలపై ఆరా తీశారు. వీటి నిర్మాణంతో ఆయా పంట పొలాల్లో భూగర్భజలాలు ఇంకిపోకుండా పుష్కలంగా ఉంటాయని వెల్లడించారు.

క్లస్టర్ పాఠశాలలకు టీఎల్ఎం సామగ్రి పంపిణీ

రేగిడి: మండలంలోని లింగాలవలస గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆ పాఠశాల క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు టీఎల్ఎం మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల విడుదలైన సీఆర్‌సీ గ్రాంటు నుంచి ఈ మెటీరియల్ కొనుగోలు చేసినట్లు పాఠశాల హెచ్ఎం దాసరి కృష్ణారావు తెలిపారు. మొత్తం 17 పాఠశాలలకు వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి పి.రామకృష్ణ, సీఆర్ఎంటీ కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అంటే భ్రష్ట్ జుమ్లా పార్టీ

రాజాం: బీజేపీ అంటే భ్రష్ట్ జుమ్లా పార్టీ అని, ప్రశ్నించే గొంతును నొక్కాలని కుట్రలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుప్పిలి చైతన్యకుమార్ అన్నారు. విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. బీజేపీకి కాంగ్రెస్ పార్టీ అంటే భయం పట్టుకుందని విమర్శించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై సీబీఐ, ఈడీలను సొంత ఏజెన్సీలగా వాడుకుని అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను స్వాధీనం చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై చార్జిషీటు దాఖలు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు.

ప్రధాన రహదారిలో గోతులు

రేగిడి: మండలంలో సంకిలి – ఉంగరాడ మెట్ట గ్రామాల మధ్య ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి గోతులతో ప్రమాదకరంగా మారింది. పాలకొండ–విశాఖ ప్రాంతాల మధ్య ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. వీటికి తోడు వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు రవాణా చేస్తున్నాయి. గోతులు ప్రమాదకరంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాబ్ కార్డు ఉన్న వారికి పని

రామభద్రపురం: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పిస్తామని ఉపాధిహామీ ఏపీఓ త్రినాధరావు అన్నారు. మండలంలోని జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించి మస్తర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే పూర్తి వేతనం వస్తుందన్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఉపాధి పనులు ఊపందుకున్నాయన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రాజాం సిటీ: అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో మహిళలు ఆందోళన చెందకుండా అవగాహనతో వ్యవహరించాలని రాజాం ఫైర్ ఎస్ఐ టీఎస్ఎస్ జనార్దనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాజాంలోని పలు అపార్ట్‌మెంట్‌లలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ మంటను ఆర్పే విధానాన్ని మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి దోసరిరామినాయుడువలస గ్రామ సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు విధుల్లో అలసత్వం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. మన మిత్ర వాట్సాప్‌పై డోర్ టు డోర్ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే ఎదుగుదల

వంగర: పౌష్టికాహారంతోనే చిన్నారుల్లో ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్తలు నెల్లి విజయలక్ష్మి పండిట్ అన్నారు. పోషన్ పక్వాడ్ ప్రోగ్రాంలో భాగంగా అంగన్‌వాడీ–1 కేంద్రంలో బరువులు తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పిల్లలు ఎదుగుదలకు, బరువులు పెరిగేందుకు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.తేజేశ్వరి, ఎస్.పావని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వంగరలో చిరుజల్లులు

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చిరుజల్లులు కురిసాయి. వంగర, మగ్గూరు, కె.కొత్తవలస, కొండచాకరాపల్లి, కొప్పరవలస, రుషింగి, మద్దువలస తదితర గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

మెంటాడ: బడి ఈడు పిల్లలను గుర్తించి తప్పనిసరిగా ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోని కృషి చేయాలని సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ కె.రామరావు అన్నారు. మెంటాడలోని జెడ్పీ హైస్కూలుతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను, గ్రామంలోని బడి ఈడు వయస్సు ఉన్న పిల్లలు ఇంటికి వెళ్లి విద్య ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్కూలులో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఎస్ఎస్ఏ సీఎంఓ ఆదినారాయణ, ఏఎంఓ ప్రసాద్, ఏపీఓ గోపిచంద్, హెచ్.ఎం. సి.హెచ్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం

మెంటాడ: మండల పరిషత్ నిధులతో పాటు, 15వ ఫైనాన్స్ నిధులతో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం సీసీ రోడ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.10లక్షలతో ఈ పనులు చేపట్టారు. పనులను ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడుతో పాటు పీఆర్ జేఈ గౌతమ్ తదితరులు పర్యవేక్షించారు.